

అడుగు పెడితే ఆహ్లాదమే!

ఆ పార్కు లోపలికి అడుగు పెట్టగానే సుందరంగా తీర్చిదిద్దిన స్వాగత తోరణం ఆహ్వానం పలుకుతుంది. పార్కులో ఎటు చూసినా పరుచుకున్న పచ్చదనం మనసుకు ఆహ్లాదాన్ని అందిస్తోంది. సువిశాల ప్రాంగణంలో అన్ని వయసుల వారికి అనుకూలంగా సమకూర్చిన వసతులను చూస్తే ఆటలాడటానికి, సేదతీరడానికి హృదయం ఉవ్విళూరుతుంది. కుటుంబం నుంచి చిన్నారులు, వారి తల్లిదండ్రులు, అమ్మమ్మ తాతయ్యలతో కలిసి వచ్చినా అందరికీ అనువైన, వారి అభిరుచులకు తగ్గట్టుగా ఉంటుంది ఐఎస్‌సదన్ డివిజన్ శ్రీలక్ష్మీనగర్ కాలనీలోని థీమ్ పార్కు. -సైదాబాద్

- థీమ్ పార్కులో పరుచుకున్న పచ్చదనం
- శ్రీలక్ష్మీనగర్ కాలనీలో రూ. 2 కోట్లతో నిర్మాణం
- మల్టీ జనరేషన్ కాన్సెప్ట్‌తో అన్ని ఏర్పాట్లు
- నిత్యం సందర్శకుల తాకిడి

2500 గజాల విస్తీర్ణంలో..

శ్రీలక్ష్మీనగర్ కాలనీలోని 2500 గజాల విశాలమైన స్థలంలో సుమారు రూ. 2 కోట్ల నిధులతో జీహెచ్‌ఎంసీ అధికారులు మల్టీ జనరేషన్ థీమ్‌తో పార్కును అభివృద్ధి చేశారు. అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన పార్కును ఈ ఏడాది జనవరిలో యాకత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి ప్రారంభించారు. చిన్నారులు, యువత, మహిళలు, మధ్య వయస్కులు, వృద్ధులు ఇలా అందరికీ ఉపయుక్తంగా ఉండేలా పార్కును తీర్చిదిద్దారు. పలు అధునాతన విదేశీ సామగ్రిని సైతం పార్కులో ఏర్పాటు చేశారు. చిన్నారుల కోసం ప్లే ఏరియా, పెద్దలకు యోగా చేసుకునేందుకు ప్రత్యేక నిర్మాణం, మహిళలు కిట్టీ పార్టీలు చేసుకునేందుకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేశారు. 50కి పైగా ఔషధ మొక్కలతో సహా పార్కులో పచ్చదనాన్ని తీర్చిదిద్దారు. పార్కులో విశాలమైన వాకింగ్ ట్రాక్‌లు నిర్మించారు. వాకింగ్ ట్రాక్‌లే కాకుండా చెప్పులు లేకుండా నడక సాధన చేసేవారి కోసం నల్లరేగడి, ఇసుక, మట్టి, కంకర రాళ్లతో ప్రత్యేక ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. రెండు ప్రత్యేక సెల్ఫీ స్పాట్లు పార్కు ప్రత్యేకతలకు అదనం.

ఉదయం సాయంత్రం సందడే సందడి...

అధునాతన వసతులతో తీర్చిదిద్దిన శ్రీలక్ష్మీనగర్ కాలనీ పార్కులో ఉదయం సాయంత్రం వేళల్లో సందర్శకులతో సందడి నెలకొంటుంది. చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్లే ఏరియాలో పలురకాల ఆటలు ఆడుతూ బాలలు చేసే సందడి చూడముచ్చటగా ఉంటుంది. పార్కులో ఏర్పాటు చేసిన రెండు షటిల్ గ్రౌండ్‌లో యువత ఆటలాడేందుకు పోటీలు పడుతుంటారు. ఉదయం, సాయంత్రం వాకింగ్ కోసం వచ్చే వారితో పార్కు కళకళలాడుతుంది. విశాలమైన వాకింగ్ ట్రాక్‌పై సమూహాలుగా నడక సాగిస్తూ, ముచ్చట్లు చెప్పుకుంటూ సాధన చేస్తుంటారు. పార్కు పర్యవేక్షణకు సైతం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. షిఫ్ట్‌కు ఇద్దరు చొప్పున, మూడు షిఫ్ట్‌ల్లో ఆరుగురు పర్యవేక్షకులు విధులు నిర్వహిస్తున్నారు.

పూర్తిస్థాయి వీధిదీపాలు అమర్చితే మరింతా సౌకర్యం..

అయితే.. అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు పూర్తిస్థాయిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయటంలో విఫలమయ్యారు. థీమ్ పార్కుకు అనుగుణంగా ఏర్పాటు చేసిన నిర్మాణాల వద్ద అంతే స్థాయిలో అధునాతన దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. పార్కులోని పలు నిర్మాణాలకు అంతరంగా దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. పార్కులో ప్రస్తుతం తాత్కాలిక లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. పార్కు నలుమూలల ఫ్లడ్ లైట్లను అమర్చారు. దాంతో చీకటి పడుతూనే అరకొర లైటింగ్ లోనే యువత ఆటలు ఆడాల్సి వస్తుంది. పార్కు ప్రాంగణం పెద్దది కాబట్టి అందుకు అనుగుణంగా అధునాతన దీపాల వ్యవస్థ అమర్చితేనే థీమ్ పార్కు లక్ష్యం నెరవేరుతుంది. దీపాల ఏర్పాటుకు ప్రత్యేక నిధులు మంజూరు కావాల్సి ఉందంటూ ఎప్పటికప్పుడు పెండింగ్‌లో పెడుతున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కులో అధునాతన లైటింగ్ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

ఆదర్శంగా థీమ్ పార్కు..



శ్రీలక్ష్మీనగర్ కాలనీలో తీర్చిదిద్దిన మల్టీ జనరేషన్ థీమ్ పార్కు ఆదర్శంగా నిలుస్తోంది. థీమ్ పార్కులను డివిజన్ పరిధిలోని ఇతర కాలనీల్లోనూ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నాం. ఇక్కడి పార్కులోని లైటింగ్ వ్యవస్థ సమస్యను జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులతోనూ చర్చించాం. ప్రస్తుతానికి ఇబ్బందులు కలుగకుండా తాత్కాలిక దీపాలు ఏర్పాటు చేయించాం. త్వరలో పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయిస్తాం.

-జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, కార్పొరేటర్

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..



విశాలంగా ఉండే పార్కు పరిసర కాలనీల వాసులకు కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం పార్కుకు బారులుతీరుతుంటారు. ఇక్కడి పార్కు వేరే కాలనీలకు మోడల్‌గా నిలుస్తోంది. అయితే ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బంది తలెత్తుతోంది. పార్కులోని సమస్యను ప్రభుత్వ పెద్దలు, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఫ్లడ్‌లైట్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

-కోట్ల శ్రీనివాస్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్



పచ్చదనంతో నిండుకున్న పార్కులోని లాన్ ప్రాంతం

నేడు డయల్ యువర్ డీఎం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 ఆర్టీసీ నుంచి నడిచే సర్వీసులకు సంబంధించి ప్రయాణికుల నుంచి సలహాలు, సమస్యలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఉద్గీర్, బీద్‌కుండ్, జుకల్, కొల్హాపూర్, విజయవాడ, బైలడిల్లా, జగదల్‌పూర్, బెంగళూర్, తొర్రూర్ వెళ్లే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు నేరుగా డీఎంతో మాట్లాడవచ్చన్నారు. సమస్యలు తెలిపేందుకు 99592 26249 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సమైక్యతా స్ఫూర్తి నేటి సమాజానికి అవసరం

మన్సూరాబాద్: అష్ఫాఖ్–బిస్మిల్, ఉద్ధమ్‌సింగ్, స్వామి వివేకానంద, నేతాజీ, గాంధీ–గఫార్‌ఖాన్ సమైక్యతా స్ఫూర్తి నేటి సమాజానికి అవసరమని ఖదిజ్జాసీ రమణమూర్తి, జయహో జాతీయ అధ్యక్షుడు విజయశంకర్ స్వామి అన్నారు. అష్ఫాఖ్–బిస్మిల్ వర్ధంతి పురస్కరించుకుని జైభారత్ ఉద్యమం, జయహో సంయుక్త ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ సూర్యోదయకాలనీలోని జైభారత్ కేంద్ర కార్యాలయం నుంచి సమైఖ్యత ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విజయశంకర్‌స్వామి, రమణమూర్తి మాట్లాడుతూ.. హిందూ ముస్లింల ఐక్యత దేశానికి అవసరమన్నారు. డిసెంబర్26న ఉద్ధమ్‌సింగ్ జయంతి, జనవరి 12న స్వామి వివేకానంద జయంతి, జనవరి 20న అబ్దుల్ గఫార్‌ఖాన్ వర్ధంతి, జనవరి 23న నేతాజీ జయంతి, జనవరి 30న గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని డిసెంబర్ 19 నుంచి జనవరి 30 వరకు హిందూ ముస్లిం సమైఖ్యతా దినాలుగా పాటిస్తున్నామన్నారు. మతోన్మాదం దేశానికి తీవ్రమైన సమస్య అని దేశం కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన హిందూ, ముస్లిం వీరుల త్యాగాలు నేటి తరానికి తెలపడమే ప్రధాన లక్ష్యంగా సభలు, సమైఖ్యతా ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీలో ఖదిజ్జాసీ లోక్‌నాథ్, రజనీ, వంశీ, వెంకన్న, సలీం, మల్లీకా వల్లభ, లక్ష్మేశ్వర్, రాజు, లావణ్య, ఉమ, లక్ష్మి పాల్గొన్నారు.



ఎల్‌బీనగర్‌లో సమైక్యతా ర్యాలీ

రోడ్లకు మరమ్మతు చేపట్టండి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతు చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ ఏఈ రాజ్‌కుమార్‌తో కలిసి గురువారం ఆయన ఎస్కేడీ నగర్, వైదేహినగర్ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గుంతలమయంగా ఉన్న రోడ్లతో కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు దామోదర్‌రెడ్డి, శంకరయ్యగౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

వినతి

మన్సూరాబాద్: డివిజన్ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు.



రోడ్డును పరిశీలిస్తున్న మొద్దు లచ్చిరెడ్డి

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



భోజన నాణ్యతను పరిశీలిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

చంపాపేట: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు కొంతం గోవర్ధన్‌రెడ్డి సూచించారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనం, వంటగది, వంట సరుకులు, పరిసరాల పరిశుభ్రత వంటి పలు అంశాలను పరిశీలించి మాట్లాడారు. కూరలు అంతగా రుచికరంగా లేవన్నారు. గుడ్లు ఉడికించిన అరగంటలో మాత్రమే విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం ముందుగా ఉపాధ్యాయులు రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని అన్నారు. భోజనం నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ఎన్ఎఫ్ఎస్ యాక్ట్, ఫుడ్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు.

కేంద్రమంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి



అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మన్సూరాబాద్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్రమంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని రాష్ట్ర రోడ్డు భవనాల కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలోఎల్‌బీనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి గురువారం పాలాభిషేకం చేసి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. అగ్రకుల అహంకారంతో అమిత్‌షా అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా అందోళనలు చేపడతామని హెచ్చరించారు. జక్కిడి ప్రభాకర్ రెడ్డి, జితేందర్, రామ్మోహన్‌గౌడ్, జోగురాములు, గణేష్‌నాయక్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

- కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేంద్రమంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పి మంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మనోహర్, ఎల్లయ్య, రామస్వామి, యాదయ్య, శ్రీనివాసు, వెంకటయ్య, మల్లేష్, దుర్గారావు పాల్గొన్నారు.

డీఎస్‌నగర్‌లో..

సైదాబాద్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా వెంటనే దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం ఐఎస్‌సదన్ డివిజన్ డీఎస్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట్ల లడ్డూ పటేల్, శ్రీరాములు, గని, సురేష్ కుమార్, కృష్ణ, శశికుమార్, మల్లికార్జున్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కోట్ల శ్రీనివాస్



ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో..

అభాగ్యులకు అండగా సీఎంఆర్‌ఎఫ్



చెక్కును అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: సీఎంఆర్‌ఎఫ్ పేద ప్రజలకు అండగా నిలుస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మేడిపల్లికి చెందిన అనసూయ మహాజన్‌కు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కును గురువారం నాగోలు తన నివాసంలో బాధితురాలికి శ్రీనివాస్‌గుప్తా అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి అండగా నిలుస్తోందన్నారు. శ్రీధర్, చికోటి సంపత్, జిల్లా వంశీ పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం



సరిత



అనన్య, ఆద్య

హయత్‌నగర్: ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. భర్తకు దూరమైన మందుల సరిత తన ఇద్దరు కుమార్తెలు అనన్య(5), ఆద్య(4)తో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్టులోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నివసించే తన అక్క వద్ద ఉంటుంది. రెండు నెలల క్రితం ఆమె హయత్‌నగర్‌లోని వీరభద్ర కాలనీలోకి అద్దెకు తీసుకుని రామోజీ ఫిలింసిటీలో షూటింగ్‌లో పని చేస్తుంది. మూడ్రోజుల నుంచి సరిత ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో బంధువులు ఇంటికి వచ్చి చూడగా అక్కడి నుంచి ఇల్లు ఖాళీ చేసినట్లు యజమాని తెలిపాడు. సరిత అక్క కొడుకు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మరో ఘటనలో మైనర్..

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ శాంతినగర్‌లో నివసించే ఓ మైనర్(15) అదృశ్యమైంది. బుధవారం కుటుంబ సభ్యులు వారివారి పనులపై బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి రాగా మైనర్ బాలికి కనిపించలేదు. ఆందోళనకు గురై, స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గురువారం తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బాక్స్ డ్రైనేజీ పనులను పూర్తి చేయాలి

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో నిలిచిపోయిన బాక్స్ డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. నాగేశ్వర్‌నగర్ కాలనీ, ఎస్‌ఆర్ఎల్ కాలనీ, తెలంగాణ పార్క్‌లో గురువారం ఆయన పర్యటించారు. గాయత్రిపురం నుంచి నాగేశ్వర్‌నగర్, శ్రీ రామలింగేశ్వర కాలనీ మీదుగా మూసీకి వెళ్లే బాక్స్ డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. బాక్స్ డ్రైనేజీ పనులు పూర్తయిన ప్రాంతాల్లో నూతన సీసీ రోడ్లే వేసేలా చూడాలని అధికారులకు సూచించారు. పార్క్ అభివృద్ధికి అధికారులతో చర్చిస్తున్నామని పార్కులో ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్పొరేటర్ వెంట అధికారులు బుచ్చయ్య, శానిటైజేషన్ సూపర్‌వైజర్ ప్రేమ్, భరత్, రాజురెడ్డి, కాలనీ వాసులు సుధాకర్, విజయభాస్కర్, జంగయ్య, లక్ష్మీరాజు, రవి, రాకేష్ యాదవ్, నారాయణ ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న పవన్‌కుమార్

ఉచిత న్యాయసలహా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

హస్తినాపురం:పేద ప్రజలకు కావాల్సిన న్యాయ సహాయాన్ని అందించేందుకు ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ అన్నారు. హస్తినాపురం సెంట్రల్‌కాలనీ లోని నివాసితుల సంక్షేమ సంఘం భవనంలో ఉచిత న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు చేసి బాధితులకు న్యాయం జరిగేలా తాము సలహాలు ఇస్తున్నామన్నారు. ప్రతి గురువారం నిర్వహించే కార్యక్రమాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు, కొండారెడ్డి, కె.ఆనంద్‌రావు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



న్యాయ సలహాలు ఇస్తున్న జస్టిస్ చంద్రకుమార్

ముగిసిన అంతర్జాతీయ శిక్షణ

మన్సూరాబాద్: అభివృద్ధి చెందుతున్న దేశాల భూవిజ్ఞాన శాస్త్రజ్ఞుల రిమోట్ సెన్సింగ్, డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్‌పై 14వ అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమం గురువారం భారతీయ భూవైజ్ఞానిక సర్వే శిక్షణా సంస్థ (జీఎస్ఐటీఐ)లో ముగిసింది. ఈ కార్యక్రమానికి జీఎస్ఐటీఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్. రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సామాజిక, ఆర్థిక అభివృద్ధి, వృత్తిపరమైన నైపుణ్యం, సాంకేతికతను పంచుకోవడం కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు. నూతనంగా నేర్చుకున్న సాంకేతికతలను వారి వృత్తిలో ఉపయోగించి నైపుణ్యాలను పెంచుకోవాలని ఆకాంక్షించారు. 14 దేశాల నుంచి 22 మంది శాస్త్రవేత్తలు మూడు వారాల పాటు శిక్షణలో పాల్గొన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎబీ ఎక్కా, ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్‌రవి

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు.. టమాట రూ. 15, వంకాయ రూ. 28, బెండ రూ. 50, పచ్చిమిర్చి రూ. 28, కాకర రూ. 38, బీర రూ. 55, క్యాబేజీ రూ. 18, ఫ్రెంచిబీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 25, దొండ రూ. 45–50, చిక్కుడు రూ. 50, గోకర రూ. 35, బీట్‌రూట్ రూ. 45, క్యాప్సికం రూ. 50, ఆలు రూ. 27, దోస రూ. 23, సొరకాయ రూ. 11, పొట్లకాయ రూ. 18, ఉల్లిగడ్డ రూ. 40, చామగడ్డ రూ. 35. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఏకాగ్రతతో పరీక్షలకు సిద్ధం కావాలి

సైదాబాద్: పదవ తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో పరీక్షలకు సిద్ధం కావాలని సేఫ్ ఫౌండేషన్ నిర్వాహకురాలు ప్రొఫెసర్ సుజాత సూరేపల్లి సూచించారు. దళిత మహిళా సంఘం, సేఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైదాబాద్ డివిజన్ పరిధిలోని శంకేశ్వరబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు రోజూ ఉదయం ఉచితంగా అల్పాహారాన్ని అందిస్తున్నారు. గురువారం సంస్థ ప్రతినిధులు, పాఠశాల ప్రిన్సిపాల్ సుకన్యతో కలిసి అల్పాహారాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. శంకేశ్వరబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివే చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు తెల్లవారుజామునే పనులకు వెళ్లే కూలీలని, అందువల్ల విద్యార్థులు తినకుండానే పాఠశాలకు వస్తుంటారన్నారు. ఉదయం తినకుండా వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత పెట్టలేరని, అందుకే తమ సంస్థల ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా అల్పాహారాన్ని అందిస్తున్నామన్నారు.



విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి

బడంగ్‌పేట్: నేరెడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్‌లో గురువారం కమిషనర్ ఆఫ్ పోలీస్ సుధీర్‌బాబును బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతానర్సింహారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్‌లో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. మున్సిపల్‌లో రోజురోజుకి జనాభా విపరీతంగా పెరుగుతూ వస్తోందని, ప్రజల అవసరాల దృష్ట్యా పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని మేయర్ వినతిపత్రంలో పేర్కొన్నారు. బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వయా ఆదిబట్ల వెళ్లే ప్రధాన రహదారిలో స్టేషన్‌కు సరిపోనూ స్థలాన్ని కూడా కేటాయించామన్నారు. అందుకు ఇటీవల జరిగిన కౌన్సిల్‌లో స్టేషన్ ఏర్పాటు చేసేందుకు కార్పొరేటర్లు అందరం ఏకగ్రీవ తీర్మానం కూడా చేశామని తెలిపారు. దానికి సంబంధించిన కౌన్సిల్ తీర్మాన ప్రతిని కూడా కమిషనర్ సుధీర్‌బాబుకు అందజేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, కార్పొరేటర్ పి.సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.